



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్. చేతన్

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి - కొత్తచెరువు

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 10వ తేదీన కొత్తచెరువులో పర్యటించే అవకాశం ఉన్న నేపథ్యంలో పటిష్టమైన ఏర్పాట్లను ప్రణాళికా బద్ధంగా పూర్తి చేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. ఆదివారం కొత్తచెరువు లోని శ్రీ సత్య సాయి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో ఎస్పీ వి.రత్న, జేసీ అభిషేక్ కుమార్‌తో కలసి అధికారులతో జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ సమావేశం నిర్వహించి ముఖ్యమంత్రి పర్యటనపై దిశానిర్దేశం చేశారు. నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 10వ తేదీన కొత్తచెరువు జెడ్పీ బాలురు, బాలికల పాఠశాలలు, శ్రీ సత్య సాయి ప్రభుత్వ జూనియర్ కాలేజిలలో జరిగే మెగా పిటిఎం 2.0 కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉందన్నారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటనను విజయవంతం చేయడానికి జిల్లా అధికారులకు అప్పగించిన బాధ్యతలను నెరవేర్చాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలలో ఎస్ఒపి ప్రకారం అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు.. పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సంబందిత అధికారులను ఆదేశించారు. ఆ మేరకు విధులను కేటాయించిన అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ ముఖ్యమంత్రి పర్యటనకు ప్రణాళిక బద్ధంగా ఏర్పాట్లను పూర్తిచేసి విజయవంతం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఎస్పీ వి.రత్న, జేసి అభిషేక్ కుమార్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డితో కలసి జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ జడ్పి బాలురు, బాలికల పాఠశాలలు, శ్రీ సత్య సాయి ప్రభుత్వ జూనియర్ కాలేజీలోని తరగతి గదులు, ప్రాంగణంలోని మైదానాన్ని పరిశీలించి సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు, సూచనలు జారీచేశారు. అంతకు ముందు వారు పుట్టపర్తి విమానాశ్రయాన్ని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, పుట్టపర్తి, ధర్మవరం ఆర్డీవోలు సువర్ణ, మహేష్, డీఆర్డీఏ పీడీ నరసయ్య, సిపివో విజయకుమార్, డీఈవో కిష్టప్ప, జిఎస్ డబ్ల్యూఎస్ సుధాకర్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి వంశీకృష్ణ రెడ్డి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాజు, డిపివో సమత, జిల్లా రవాణాధికారి శ్రీనివాస్, ఎస్ఎస్ఎ పీవో దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నాడు సై అన్నారు.. నేడు నై అంటున్నారు...

పురపాలక సంఘాల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులతో పాటు ఇంజినీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు న్యాయమైన కోర్కెల కోసం వైసిపి అధికారంలో ఉన్న సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఆ సమయంలో ప్రతిపక్షంలో ఉన్న కూటమి నాయకులు శిబిరాలకు వచ్చి వారు చేస్తున్న ఆందోళన కార్యక్రమాలకు మద్దతు తెలిపి, వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హిందూపురంలో జరిగిన ఆందోళన కార్యక్రమాలకు సినీ నటులు, స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శిబిరాలను సందర్శించి మద్దతు తెలిపి, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కార్మికుల సమస్యలపై జై కొట్టిన కూటమి... అధికారంలోకి వచ్చిన అనంతరం నేడు నై అంటోంది. దీంతో పురపాలక సంఘాల్లో పని చేస్తున్న కార్మికులందరు సమ్మెకు సిద్ధమయ్యారు.

ప్రజాశక్తి హిందూపురం

2024లో మరో మూడు నెలల్లో ఎన్నికల వస్తుందన్న సమయంలో పురపాలక సంఘాల్లో విధులు నిర్వహించే కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు సమ్మెలోకి వెళ్లారు. ఎన్నికల నేపథ్యంలో కార్మికులు చేస్తున్న ఆందోళన కార్యక్రమాలకు టిడిపి పరోక్షంగా సహకరాలు అందించడంతో పాటు సమ్మె చేస్తున్న దీక్షా శిబిరాలకు వద్దకు వెళ్లి సంపూర్ణ మద్దతు తెలపడంతో పాటు న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం తీర్చాలని డిమాండ్ చేశారు. అప్పటి ప్రభుత్వం కార్మిక సంఘాల నాయకులతో చర్చించి, డిమాండ్లలో కొన్నింటిని పరిష్కరిస్తామని చెప్పడంతో పాటు దీనిపై జీవో సైతం విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ఎన్నికల కోడ్ రావడంతో కార్మికులు తాము చేస్తున్న ఆందోళన కార్యక్రమాలను విరమించారు. 2024 సంవత్సరంలో కార్మికులు చేస్తున్న ఆందోళన కార్యక్రమాలకు మద్దతు పలకిన కూటమి ఆ సందర్భంలో జరిగిన ఎన్నికల్లో అధికారంలోకి వచ్చింది. దీంతో కార్మికులందరు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశించారు. అయితే హామీలపై హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కార్మికుల ఆశలపై నీళ్లు చెల్లింది. ఒక్క పురపాలక సంఘాల్లో పని చేస్తున్న కార్మికులే కాకుండా ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులపై కొరఢా ఝులుపించింది. గత ప్రభుత్వం కార్మికుల భద్రత కోసం తీసుకోచ్చిన ఆప్కాస్‌ను రద్దు చేసి, పొరుగు సేవలను ఏజెన్సీలకు అప్పగించే యోచనతో ప్రభుత్వం ముందుకు వెళుతోంది. ఆయా ప్రభుత్వ శాఖల్లో ఎన్నో సంవత్సరాలుగా ఉద్యోగుల విరమణ తరువాత కొత్తగా పోస్టింగ్‌లు ఇవ్వడం మానేశారు. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికుల పేరుతో వెట్టి చాకిరీ చేయించుకుంటూ అతితక్కువ వేతనాలు ఇస్తున్నాయి. కార్మికులు తమను పర్మినెంట్ చేయాలని ఎన్నో ఏళ్లుగా ఆందోళన నిర్వహిస్తున్నారు. వీరు డిగ్రీలు, పీజీలు పూర్తి చేసి కుటుంబ అవసరాల కోసం కష్టపడి పనిచేస్తున్నారు. శ్రీ సత్య సాయి జిల్లాలో 1100, అనంతపురం జిల్లాలో 3000 మంది వరకు కార్మికులు ఆప్కాస్ కార్పొరేషన్ నుంచి వేతనాలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో వీరు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి..



పారిశుధ్య కార్మికుల సమ్మెకు మద్దతు ఇచ్చిన బాలయ్యకు వినతిని ఇస్తున్న కార్మికులు (ఫైల్ ఫోటో)

◆ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీ ఏమైంది..?
◆పొరుగు సేవలను ఏజెన్సీలకు అప్పగించే యోచనలో ప్రభుత్వం
◆సమ్మెకు సిద్ధమంటున్న మున్సిపల్ కార్మికులు



చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసనదీక్షలో పాల్గొన్న సిఐటియు నాయకులు, కార్మికులు

కార్మికులను మోసం చేయడానికి సిద్ధంగా ఉన్న ప్రభుత్వం..!

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తమను పర్మినెంట్ చేయాలని ఎన్నో ఏళ్లుగా ఆందోళన నిర్వహిస్తున్నారు. దీనిని పక్కన పెట్టి ఆసలకే మోసం చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తుంది. కార్మికులకు కనీస వేతనం ఇవ్వడం లేదు. కనీసం రూ.27 వేలు ఇవ్వాలని ప్రభుత్వ సిఫార్సు ఉంది. దీనిని అమలు చేయమని మాత్రమే కార్మికులు అడుగుతున్నారు. హిందూపురం పురపాలక సంఘంతో పాటు పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, పెనుకొండ, మడకశిరాతో పాటు అనంతపురం నగరంతో పాటు అనేక మున్సిపాలిటీల్లో పారిశుధ్య కార్మికులు తెల్లవారు జామున 5 గంటలకే విధుల్లో కనిపిస్తున్నారు. వీధులు చిమ్మడం, డ్రెయినేజీ పూడికలు తీయడం, ఇలా అన్ని పనుల్లో ఉంటున్నారు. వీరికి కనీస వేతనం కూడా అందడం లేదు. పనిచేస్తూ అప్పులు తెచ్చుకొని, వడ్డీలు కడుతూ కుటుంబాలను షోషించుకుంటున్నారు. ఇటీవల కాలంలో నిత్యావసర ధరలు భారీగా పెరిగిపోయాయి. విద్య, వైద్యం ఖరీదైంది. శారీరక కష్టం పడుతోన్న కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడానికి ప్రభుత్వాలకు చేతులు రావడం లేదు. ఇదే కాకుండా అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులున్నారు. వీరి పరిస్థితి అలానే ఉంది. అప్కాస్ కార్పొరేషన్ ద్వారానైనా పూర్తి వేతనం చేతికొచ్చి, పిఎఫ్, ఇఎస్ఐ, జిఎస్‌టి చెల్లిస్తోన్న సమయంలో ప్రభుత్వం ఏజెన్సీలకు లింకుపెట్టడాన్ని కార్మికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ విషయంపై జిల్లా వ్యాప్తంగా కార్మికులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని డియాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా మెరుపు సమ్మెకు సిద్ధమని కార్మికులు హెచ్చరిస్తున్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధం



పురపాలక సంఘాల్లో పని చేస్తున్న పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని. లేని పక్షంలో ఏ క్షణంలోనైనా రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెలోకి వెళ్తాం.. కూటమి ప్రతి పక్షంలో ఉన్న సమయంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఉద్యమిస్తే, ఆ సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా టిడిపి, జనసేన నాయకులు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ కూడా దీక్షా శిబిరాలకు వచ్చి మద్దతు ఇచ్చి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అయితే అధికారంలోకి వచ్చిన అనంతరం సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తి విఫలమయ్యారు. కార్మికులు విధులు నిర్వహించాలంటే వారికి పనిముట్లు చాలా ముఖ్యం. అలాంటి పనిముట్లను ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదు. వెంటనే కార్మికులకు ఇవ్వాల్సిన పనిముట్లు, ఏకరూప దుస్తులు, చెప్పులు, కొబ్బరినూనె వెంటనే ఇవ్వాలి. వీటితోపాటు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ పరిష్కరించాలి.. లేనిపక్షంలో ఏ క్షణంలోనైనా విధులను బహిష్కరించి మెరుపు సమ్మెలోకి వెళ్తాం.

ఇఎస్ వెంకటేష్,
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

వలస పక్షుల గూడును చిదిమేస్తున్నారు...

నిషేధిత ప్రాంతంలో పచ్చనిచెట్లు నరికివేత

ప్రజాశక్తి - చిలమత్తూరు.

అది సైబీరియన్ పక్షుల అతిథి కేంద్రం. అక్కడ ఆ పక్షులు నివాస కేంద్రాలు ఏర్పాటు చేసుకునే చెట్లు సంఖ్య తక్కువగా ఉండటంతో ఇప్పటికే ముళ్ల చెట్లను సైతం ఆవాసాలుగా మార్చుకొని గూడును నిర్మించుకుంటున్నాయి. అలా నిర్మించుకున్న గూళ్లు గాలీవానకు గూళ్లలోని పక్షి పిల్లలు ముళ్ల కంపల్లో చిక్కుకొని మృత్యువాత పడుతున్నాయి. ఇలా గత రెండేళ్ల క్రితం జరిగిన విపత్తులు పదుల సంఖ్యలో పక్షులు మృతి చెందాయి.. ఇలాంటి పరిస్థితులలో ఆ ప్రాంతాన్ని పరిశీలన చేసిన అనేక మంది పరిశోధకులు ఆ ప్రాంతంలో చెట్లను అధికంగా పెంచాలని సూచించారు. అంతకు ముందు నుండే అక్కడి ప్రాంతంలో చెట్లను కొట్టడాన్ని నిషేధించారు. అయితే కొంత మంది అక్రమ కలప రవాణాదారులు ఆ ప్రాంతంలోని చెట్లను నరికి సొమ్ము చేసుకుంటున్నారు. దీనికి తోడు అటవీ శాఖ అదికారుల పర్యవేక్షణ కొరవడింది. ఆదివారం ఆ ప్రాంతంలోని వేప, టేకు చెట్లను స్వార్థపరులు నేలమట్టం చేశారు. దీంతో ఆ ప్రాంతంలోని రైతులు ఇచ్చిన సమాచారం మేరకు ప్రజాశక్తి పరిశీలన చేసి అటవీశాఖ అదికారులకు సమాచారం అందించింది. దీంతో అధికారులు వచ్చి చెట్లను కోయడానికి ఉపయోగించే రెండు డీజల్ మిషన్లను వారినుంచి స్వాధీనం చేసుకున్నారు. అలాగే దీనిపై కేసు నమోదు చేస్తామని అన్నారు. ఏది ఏమైన అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యంతో అక్రమార్కుల ఆగడాలతో సైబీరియన్ వలస పక్షుల అతిథి కేంద్రంగా ఉన్న వీరాపురం పంచాయతీలోని చెట్లు నేల మట్టం అవుతున్నాయి. అలాగే అతిథి పక్షుల గూళ్లు చెదరుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకొని పక్షుల కేంద్రాన్ని పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.



నిషేధిత ప్రాంతంలో చెట్లను నరికివేసిన దృశ్యం

'బాబు' మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ ఎమ్మెల్సీ సతీష్ రెడ్డి పిలుపునిచ్చారు. 'బాబు షూరిటీ మోసం గ్యారెంటీ.. రీ కాల్ చంద్రబాబు పేరుతో ఆదివారం ఆ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కార్యకర్తలు నాయకులతో సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ సమన్వయకర్త దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సతీష్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలలో బాబు 143 హామీలతో పాటు సూపర్ సిక్స్ ప్రకటించారన్నారు. ఏడాది దాటిన ఏ ఒక్కటి సక్రమంగా అమలు చేయలేదన్నారు. అన్నదాత సుఖీభవ, బస్సులో ఉచిత ప్రయాణం, మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ లాంటి హామీలేవీ పట్టించుకోలేదన్నారు. వేరుశనగకు మామిడికి గిట్టుబాటు ధర లేక రైతులు విలవిలాడుతున్నారన్నారు. విద్యుత్ బిల్లులు విపరీతంగా పెంచారని సంపద సృష్టించడం అంటే ఇదేనా అని ప్రశ్నించారు. ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు, దౌర్జన్యాలు పెరిగాయన్నారు. పుట్టపర్తిలో పేకాట జూదం జరుగుతున్న అరికట్టే వారేలేరన్నారు. మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో చెట్లను నరికించే సంస్కృతి కూటమి ప్రభుత్వంలో ఏర్పడిందన్నారు. గత వారం క్రితం వెంగళమ్మ చెరువులో ఒక రైతు మామిడి మొక్కలను నరకించారన్నారు. ఫిర్యాదు చేసినా పోలీసులలో చలనం లేదన్నారు. పార్టీ జిల్లా పరిశీలకులు రమేష్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు ప్రజల పక్షాన వైసిపి పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ కన్వీనర్ రవి నాయక్, మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి, మాజీ అగ్రిగోల్డ్ సలహా మండలి చైర్మన్ అవుటాల రమణారెడ్డి, నాయకులు శ్యామ్ సుందర్ రెడ్డి, మాజీ కన్వీనర్ గంగాద్రి, రాష్ట్ర మహిళా కార్యదర్శి సాయిలీలతో పాటు ఆరు మండలాల కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సతీష్ రెడ్డి

సొసైటీల ద్వారా మత్స్యకారులు అభివృద్ధి చెందవచ్చు

జిల్లా మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్. చంద్రశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

మత్స్యకారులు సొసైటీల ద్వారా అభివృద్ధి చెందవచ్చని జిల్లా మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్. చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. చెరువులలో సమృద్ధిగా నీరు చేరినప్పుడు అందులో చేప పిల్లలను వదిలి వాటిని కంటికి రెప్పలా కాపాడుకుంటూ కేజీ లేదా రెండు మూడు కేజీల సైజు వచ్చిన తరువాత ఆ చేపలను విక్రయించి మత్స్యకారులు తమ కుటుంబాలను పోషించుకుంటుంటారు. ఏ చెరువులలో నీరు ఉంటుందో అక్కడ కొంతమంది మత్స్యకారులు సొసైటీగా ఏర్పడి వచ్చిన రాబడులను అందరూ సమంగా పంచుకొని జీవనాన్ని కొనసాగిస్తుంటారు. సమృద్ధిగా చెరువులలో నీరు ఉంటేనే వారి వృత్తి కొనసాగుతుంది. లేదంటే ఆ వృత్తి వదిలి వేరే పనులు చేసుకోవాల్సి ఉంటుంది. చేపలను పట్టేది ఒక ఎత్తు అయితే వాటిని అప్పటికప్పుడు విక్రయించుకోవాల్సి ఉంటుంది. అమ్ముడు పోకపోతే ఆ చేపలను ఎండబెట్టి ఎండు చేపలుగా కూడా అమ్ముకోవాల్సి ఉంటుంది. ఈ వృత్తినే నమ్ముకున్న తమకు ప్రభుత్వం నుంచి తగిన సహాయ సహకారం అవసరమని మత్స్యకారులు పేర్కొంటున్నారు. చేపలు పట్టడానికి వలలు, పడవలు, అమ్ముకోవడానికి మోటారు సైకిళ్ళు, వాహనాల కొనుగోలుకు ప్రభుత్వం తగిన ఆర్థిక రుణాలు అందించాలని మత్స్యకారులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో మత్స్యకారుల పరిస్థితి, ప్రభుత్వం నుంచి వారికి అందిస్తున్న సదుపాయాల గురించి జిల్లా మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్. చంద్రశేఖర్ రెడ్డి ప్రజాశక్తి ముఖాముఖికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు.





ఎన్. చంద్రశేఖర్‌రెడ్డి

ప్రశ్న : జిల్లాలో ఎన్ని మత్స్యకారుల సొసైటీలు ఉన్నాయి? సభ్యుల వివరాలు తెలపండి?

జవాబు: జిల్లాలో 43 మత్స్యకారుల సొసైటీలు ఉన్నాయి. ఇందులో 2369 మంది సభ్యులుగా ఉన్నారు. ప్రధానంగా చేపలు పట్టేవారు, విక్రయించేవారు, రాత్రి సమయాల్లో ఆ చెరువులలో కాపలా ఉండేవారు మాత్రమే సొసైటీలలో సభ్యులుగా ఉంటారు. సొసైటీలలో సభ్యులుగా ఉన్న వారికి మాత్రమే చేపలు పట్టడానికి హక్కు ఉంటుంది. ఆయా సొసైటీలలో సభ్యులుగా ఉన్నవారు కార్యవర్గాన్ని ఎన్నుకుంటారు. ఆ కార్యవర్గం ఆధ్వర్యంలో ఆ సొసైటీ నడుస్తుంది.

ప్ర: జిల్లాలో ఎన్ని చెరువులు ఉన్నాయి? గత ఏడాది ఎన్ని చేప పిల్లలు వదిలారు?

జ: జిల్లాలో 226 చెరువులు ఉన్నాయి. ఈ ఏడాది ఇంకా చెరువుల్లో నీరు చేర లేదు. ప్రస్తుతం వర్షాకాలమే కనుక చెరువులలో నీరు చేరే దానిని బట్టి చేప పిల్లలను వదులుతాం. గత ఏడాది లెక్కల ప్రకారం 11.02 లక్షల చేప పిల్లలను వదిలాం. ఒకసారి చేప పిల్లలను వదిలితే వాటి గుడ్డు పగిలి చేప పిల్లలుగా ఉత్పత్తి కానున్నాయి.

ప్ర: మత్స్యకారులకు అందిస్తున్న ప్రభుత్వ పథకాలు వివరించండి?

జ: గత ఏడాది 21 చెరువుల పరిధిలోని సొసైటీలకు 11.92 లక్షల సబ్సిడీ రుణాలు ప్రధానమంత్రి యోజన పథకం క్రింద అందించడం జరిగింది. మత్స్యకారులకు సబ్సిడీపై చేప పిల్లలను, సీడ్ ను అందజేశాం. ఆ సొసైటీలు 60 శాతం చెల్లిస్తే 40 శాతం ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది. చెరువు యొక్క విస్తీర్ణ పరిధిబట్టి చేప పిల్లలు లేదా సీడ్ పంపిణీ చేస్తాం. గతంలో సైకిళ్లు, వలలు పంపిణీ చేయడం జరిగింది. ప్రస్తుతం అయితే అలాంటి ప్రతిపాదనలు ఏమీ లేవు. ప్రభుత్వం ఎలాంటి సహాయం అందించాలన్న నిర్ణయించాల్సి ఉంటుంది.

ప్ర: మార్కెటింగ్ సదుపాయాలు గురించి చర్యలు ఏమిటి?

జ: మార్కెటింగ్ సదుపాయాలు అంటూ ఏమీ లేవు. చెరువుల దగ్గరకి ఆ గ్రామ ప్రజలే కాకుండా సమీప గ్రామాల ప్రజలు వచ్చి చేపలు కొంటారు. ఇంకా కొంతమంది వ్యాపారులు సమీప పట్టణాల నుంచి వేకువ జామునే వచ్చి చేపలను కొనుగోలు చేసి అక్కడ అమ్మకం చేస్తుంటారు. కాబట్టి మార్కెటింగ్ సమస్య అంటూ ఏమీ లేదు. ఒకవేళ ఏ రోజైనా చేపలు మిగిలితే ఎండబెడతారు. ఎండిన చేపలు కూడా వ్యాపారులు తీసుకెళ్లి వారపు సంతల్లో విక్రయించుకుంటారు.

ప్ర: మత్స్యకారులకు మీరు ఇచ్చే సలహాలు సూచనలు ఏమిటి?

జ: చెరువులలోకి నీరు చేరితే దాదాపు ఏడాది పాటు మత్స్యకారులకు పని ఉంటుంది. మత్స్యకారులు ఇంకా సొసైటీలో చేరని వారు ఉంటే చేరాలి. సొసైటీల ద్వారానే ప్రభుత్వ పథకాలు పొందే అవకాశం ఉంది. ఆయా సొసైటీలకు మాత్రమే చెరువులపై అజమాయిషి ఉంటుంది. చెరువులలోని చేపల ద్వారా వచ్చే ఆదాయం సొసైటీలోని సభ్యులకు మాత్రమే అందుతుంది.

ప్ర: సిబ్బంది కొరత ఉందా? మీ కార్యాలయం ఎక్కడ ఉంది?

జ: సిబ్బంది కొరత అంటూ లేదు. మా కార్యాలయం ప్రస్తుతానికైతే ప్రభుత్వం ఏర్పాటు చేసిన సత్యసాయి ట్రస్టు వారి దీన జనోద్ధారణ భవన సముదాయాల్లో ఉంది. కొత్తగా ఏర్పడిన జిల్లా కావడంతో మా శాఖకు సొంతంగా భవనం లేదు. ప్రభుత్వమే తగు చర్యలు తీసుకోవాల్సుంది.

కంటి వ్యాధులకు అత్యాధునిక వైద్య సేవలు

ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఎస్. లక్ష్మి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని దీక్ష కంటి ఆసుపత్రిలో ఆధునిక పరికరాలతో అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్నట్లు ప్రముఖ కంటి వైద్య నిపుణులు ఎస్. లక్ష్మి అన్నారు. ఈ సందర్భంగాద ఆమె మాట్లాడుతూ ప్రపంచ స్థాయి పరిమాణాలతో అత్యధిక పరికరాలతో కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పిల్లలు పెద్దలకు కంప్యూటర్‌చే కంటి అద్దాల పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోడు ఇస్తామన్నారు. పిల్లలకు పుట్టుకతో వచ్చిన కంటి సమస్యలకు వైద్యం చేసి కళ్లజోడు అవసరం లేకుండా కాంటాక్ట్ లెన్స్ అమరుస్తామన్నారు. కంటి రెప్పలు, వాపు గడ్డలకు సరైన చికిత్స చేస్తామన్నారు. మెల్లకన్ను ఆపరేషన్, నీటి కాసులకు పరీక్షలు, చికిత్స అందిస్తామని తెలిపారు. షుగర్ రోగులకు రెటీనా పరీక్షలు చికిత్స చేస్తామన్నారు. శుక్లము ఆపరేషన్ చేశాక వచ్చే కంటి లోపాలను లేజర్ చికిత్సతో తొలగిస్తామని తెలిపారు. కంటికి సంబంధించిన అన్ని పరీక్షలను నిర్వహించి సమర్థవంతంగా చికిత్సను అందిస్తామన్నారు.

ముఖ్యంగా కంటిలో డ్రైనెస్ వచ్చినప్పుడు వాటి లక్షణాలు కళ్ళ మంటలు కావడం, దురదలు, ఫోరెన్ సెన్సేషన్, చూపు మసకరావడం, కంటిలో నీటి శాతం తగ్గుట మొదలైనవి డ్రైనస్ వ్యాధి లక్షణాలని చెప్పారు. ఈ వ్యాధి సోకినప్పుడు కళ్లను చల్లనీటితో తరచూ శుభ్ర పరుచుకోవడం, కంటికి సురక్షితమైన గొగల్స్ వాడాలని, అంతే కాకుండా కళ్లను తరచూ ఆర్పుతూ ఉండాలని తెలిపారు, కళ్లకు విశ్రాంతి ఇవ్వాలని, లూబ్రికేటింగ్ కంటి చుక్కలను తీసుకోవాలని తెలిపారు. కంటిలో అలర్జీ ఏర్పడినప్పుడు కలిగే లక్షణాలు కళ్ళ ఎర్రగా ఉండుట, నీరు కారుట, దురదలు ఉండుట, కనురెప్పలు వాపు రావడం జరుగుతుందని, ఈ వ్యాధి సోకినప్పుడు కళ్లను నలపరాదని, కంటికి సంబంధించిన కూలింగ్ అద్దాలు వాడాలని, కాంటాక్ట్ లెన్స్ వాడేవారు అలర్జీస్ ఉన్నప్పుడు అలర్జీ ఉన్నప్పుడు వాడకూడదని, వెంటనే డాక్టరును సంప్రదించి సంబంధించిన చికిత్సలు తీసుకోవాలని సూచించారు. అలాగే చక్కెర వ్యాధి ఉన్న వారు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.



కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఎస్. లక్ష్మి

రెడ్ల హక్కుల కోసం ఐక్యంగా పోరాడుదాం

సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంగులకుంట నరేష్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేష్

జనాభా ప్రాతిపదికన రెడ్లకు రావాల్సిన వాటా కోసం ఐక్యంగా పోరాడి సాధించుకుందామని ఏపి రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంగులకుంట నరేష్ కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని సాయి ఆరామంలో ఆదివారం ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. నరేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని పార్టీలు రెడ్లను రాజకీయంగా వాడుకుంటున్నాయే తప్ప వారి అభివృద్ధికి కృషి చేయడం లేదని విమర్శించారు. రెడ్లపై ప్రభుత్వాలు వివక్ష చూపుతున్నాయన్నారు. వారి అభివృద్ధి, సంక్షేమానికి ఏమాత్రం చేయూతనివ్వడం లేదన్నారు. రెడ్ల ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని మాట్లాడుతూ రెడ్లు ఐక్యంగా ఉంటే హక్కులు సాధించుకోవచ్చన్నారు. రెడ్లలో కూడా పేదలు ఉన్నారని ప్రభుత్వాలు గుర్తించాలన్నారు. గత ప్రభుత్వం రెడ్లకు చేసిన అన్యాయం వల్ల అధికారం, రాజకీయంగా నష్టపోయారన్నారు. కూటమి ప్రభుత్వం కూడా రెడ్డి కార్పొరేషన్‌కు ఛైర్మన్ ఎంపిక చేయడం లేదన్నారు. అనంతరం పలు తీర్మానాలు చేసి ఆమోదించారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు పట్నం సురేందర్‌రెడ్డి, ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షులు పోతిరెడ్డి రామకృష్ణారెడ్డి, బాబుల్‌రెడ్డి, మహిళా నాయకురాళ్లు భాగ్యలక్ష్మి, సుహాసిని, పలు జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి-హిందూపురం

కార్మిక సంఘాల పిలుపుమేరకు ఈ నెల 9వ తేదీ నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు కోరారు. ఈ మేరకు సిఐటియు నాయకులు ఆదివారం పెనుకొండ రోడ్డులో ఆటో యూనియన్ కార్మికులతో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. సిఐటియు పట్టణ కన్వీనర్ రాము మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అసంఘటిత రవాణా కార్మికులు కోట్లాదిమంది ఉన్నారని, వీరంతా స్వయంశక్తితో ఫైనాన్స్, ప్రైవేటు అప్పులు చేసి ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నారని అన్నారు. పల్లెల్లో వ్యవసాయం దివాలా తీసి కొంతమంది ఈ రంగాన్ని నమ్ముకొని బతుకుతున్నారని చెప్పారు. కోట్ల మంది బతుకుతున్న ఈ రంగానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి సహాయం చేయడం లేదన్నారు. రోజంతా ఆటో నడిపినప్పటికి సాయంత్రానికి రూ. 200 కూడా మిగలడం లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నెల వచ్చేసరికి ఫైనాన్స్ వారు వేధిస్తుంటారని, గత ప్రభుత్వం వాహన మిత్ర పేరుతో కొందరికి రూ. 10వేలు ఇచ్చిందని, కూటమి ప్రభుత్వం వీరికి ఎలాంటి సహాయం అందలేదని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం ఎలాంటి మానవత్వం లేకుండా రోడ్డు రవాణా భద్రత బిల్లు తీసుకోవడం దుర్మార్గమన్నారు. ఈ బిల్లు అమలు జరిగితే రోడ్డుమీద ఏ వాహనం కూడా తిరిగే పరిస్థితి ఉండదని తెలిపారు. సిఐటియు ఈ బిల్లును వ్యతిరేకిస్తోందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా కోట్ల మంది కార్మిక సమస్యలను దృష్టిలో ఉంచుకొని వీరికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాల తీరుకు నిరసనగా జులై 9వ తేదీన జరుగు సార్వత్రిక సమ్మెను అన్ని రంగాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షులు హనుమంతు, అధ్యక్షులు బాపిరెడ్డి, సెక్రెటరీ బాబు రెడ్డి, సహాయ కార్యదర్శి నరసప్ప, ఉపాధ్యక్షులు రామాంజి, ఆటో యూనియన్ నాయకులు వి.అంజనప్ప, గురు, వినోద్, రామాంజి, జబీవుల్లా, రఫిక్, హరి, గంగాధర్, వలి తదితరులు పాల్గొన్నారు.



పెనుకొండలో సమ్మె కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిఐటియు నాయకులు

దేశవ్యాప్త సమ్మె కరపత్రాలు పంపిణీ

పెనుకొండ : 'దేశవ్యాప్త సమ్మెలో భాగంగా లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కియా పరిశ్రమ కార్మికుల సమస్యలపై ఈ నెల 9వ తేదీ చేపట్టనున్న సమ్మెలో కార్మికులు పాల్గొనాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలో సమ్మె కరపత్రాలు పంపిణీ చేశారు. సిఐటియు మండల కన్వీనర్ బాబా వలి మాట్లాడుతూ దేశంలోని పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ తెచ్చిందన్నారు. వాటిని వెంటనే రద్దు చేయాలని, పనికి తగ్గ వేతనాలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగసంస్థల ప్రయివేటీకరణ నిలిపివేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, తదితర సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సప్లై హమాలీ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగరాజు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయ కులు వెంకటేష్, సిఐటియు నాయకులు ఆరిఫ్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు నరసింహ, లక్ష్మీదేవి, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తిపై కత్తితో దాడి

ప్రజాశక్తి-హిందూపురం

పాత కక్షల కారణంగా ఓ వ్యక్తి నూర్ మహమ్మద్‌పై కత్తితో దాడి చేసిన సంఘటన ఆదివారం పట్టణంలోని సత్యసాయి నగర్‌లో చోటుచేసుకుంది. దీంతో ఆయన తీవ్ర గాయాలకు గురి కావడంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాఖీబ్ అలియాస్ టో క్రా అనే వ్యక్తి నూర్ మహమ్మద్‌పై కత్తితో ముఖానికి, గొంతువద్ద విచక్షణారహితంగా కత్తితో దాడి చేశాడు. తీవ్ర రక్తమడుగులో ఉన్న బాధితుడిని స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. ఇలా ఉండగా ఇద్దరి మధ్య స్నేహ అనుబంధం ఉండేదని, అయితే కక్షల కారణంగా నూర్ మహమ్మద్ పై దాడికి పాల్పడ్డాడని తెలుస్తోంది. కత్తిపోట్లు పొడిచిన వ్యక్తి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో లొంగిపోయినట్లు సమాచారం. ఈ సంఘటన తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకుని బాధితుడితో మాట్లాడారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఎస్పీ వి.రత్న ఆదేశాల మేరకు శనివారం పోలీసులు జిల్లా వ్యాప్తంగా పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించారు. పుట్టపర్తి రూరల్, బుక్కపట్నం ఎస్ఐలు లింగన్న, కృష్ణమూర్తి సిబ్బందితో కలిసి ఆయా మండలాల పరిధిలోని మధురే బయలుతండా అటవీ ప్రాంతంలో విస్తృతంగా దాడులు చేసి 8 మంది పేకాట జూదరులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 55,800 నగదు, 8 సెల్‌ఫోన్లు, 5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే పుట్టపర్తి మండలంలోని అమగొండపాలెం, కర్నాటక నాగేపల్లి, వెంగళమ్మచెరువు, వీరచెన్నయ్యపల్లి గ్రామాల్లో నిర్మానుష్య, శివారు ప్రదేశాలలో డ్రోన్లతో నిఘా వేశారు. బహిరంగంగా మద్యం, గంజాయి తాగడం, పేకాట, ఈవ్ టీజింగ్, తదితర నేరాలను నియంత్రించేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసే దిశగా పోలీసులు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

మహిళ కళ్లలో కారం కొట్టి చోరీ

ప్రజాశక్తి-చిలమత్తూరు

గుర్తు తెలియని వ్యక్తులు మహిళ కళ్లలో కారం కొట్టి బంగారు ఆభరణాలను లాక్కెళ్లిన ఘటన ఆదివారం మండలంలోని మొరసలపల్లి గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాలు.. ఆ గ్రామానికి చెందిన శాంతమ్మ పొలంలో గడ్డి కోయడానికి వెళ్లింది. శాంతమ్మ ఒంటరిగా ఉండడం గమనించిన గుర్తుతెలియని దుండగులు ఆమె కళ్లలో కారం చల్లి మెడలో ఉన్న 3 తులాల బంగారు ఆభరణాలను లాక్కెళ్లారు. ఈ క్రమంలో గాయపడిన శాంతమ్మను 108 సిబ్బంది చిలమత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అలాగే కేసే నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.



జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

జగ్జీవన్‌రామ్‌కు నివాళి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

కాంగ్రెస్‌పార్టీ, దళిత సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్వాతంత్ర్య సమరయోధుడు, సమతావాది, దళిత జన బాంధవుడు, సంఘసంస్కర్త, మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కాంగ్రెస్ పార్టీ నాయకులు తుంపర్తి పరమేష్ ఆధ్వర్యంలో పట్టణంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తాహిర్, సాయి, సురేష్, దళిత సంఘాల నాయకులు కేశగాళ్ల వెంకటేష్, బూదెప్ప, నల్లప్ప, అజయ్, రాజు, నరసింహ పాల్గొన్నారు.

మడకశిర : పట్టణంలోని డిహెచ్‌పిఎస్ కార్యాలయంలో డిహెచ్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఆర్.హనుమంతు ఆధ్వర్యంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హనుమంతు జగ్జీవన్ రామ్ సేవలను కొనియాడారు. ఆయనకు భారతరత్న ఇవ్వాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి తరపున డిమాండ్ చేశారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-పరిగి

స్థానిక షాదీమహల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత గుండె, కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సర్పంచి లక్ష్మీదేవి శివశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో వైద్య నిపుణులు గుండెకు సంబంధించి ఈసీజీ, టుడి ఎకో పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించారు. రోగులకు పలు సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు కళ్లఅద్దాలు పంపిణీ చేశారు. అవసరమైన రోగులకు మందులు పంపిణీ చేశారు. శిబిరంలో కిమ్స్ సవీరా ఆసుపత్రి వైద్యులు, స్థానిక నాయకులు లక్ష్మీదేవి శివశంకర్, చంద్రశేఖర్‌రెడ్డి, సలీం, తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో చికిత్స చేస్తున్న వైద్యులు

ఉపాధ్యాయులకు పిఆర్‌సి, డిఎ ఇవ్వాలి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్



సమావేశంలో మాట్లాడుతున్న జయచంద్రారెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం ధర్మవరం జోన్ యుటిఎఫ్ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. జయచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వెంటనే 12వ పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు చేయాలని, ఒకవేళ కమిషన్ ఏర్పాటు ఆలస్యమయ్యే పక్షంలో ఉద్యోగులకు 30 శాతం మధ్యంతర భృతి(ఐ.ఆర్) ప్రకటించాలని, బకాయి డిఎలు, ఆర్థిక బకాయిలను చెల్లించాలని, మెమో 57 మేరకు సెప్టెంబర్ 2004కు ముందు నియామకం ప్రక్రియ పూర్తయిన 11 వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా నాయకులు ఆర్.రామకృష్ణ నాయక్, ధర్మవరం జోన్ నాయకులు ఎం.ఆంజనేయులు, హెచ్.రామాంజనేయులు, పి.సాయిగణేష్, ఎం.వెంకటకిషోర్, రిటైర్డ్ పెన్షనర్స్ నాయకులు హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

యువ కవులు సమాజ నిర్దేశకులుగా మారాలి

ప్రజాశక్తి- హిందూపురం

లేపాక్షి ఫౌండేషన్ అధ్యక్షులు వడ్డి సుధాకర్ సారథ్యంలో ఉపాధ్యక్షులు జి.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలోని సెంట్రల్ లైబ్రరీ హాల్ లో ఆదివారం అనంత సాహితీ ఉత్సవం పేరుతో జాతీయ శతాధిక కవిసమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వడ్డి సుధాకర్ మాట్లాడుతూ లేపాక్షి ఫౌండేషన్ ప్రతి జిల్లాలోనూ వినూత్నమైన రీతిలో కార్యక్రమాలు చేస్తూ యువతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, వారిలోని ప్రతిభకు మెరుగులు దిద్దే చర్యలు చేపడుతోందన్నారు. విద్యార్థి దశనుంచే తెలుగు భాష పై సాహిత్యం పై పట్టు సాధించేలా విద్యాలయాల్లో శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. తెలుగుభాషా అభివృద్ధిలో లేపాక్షి ఫౌండేషన్ ముందుంటుందని తెలియజేశారు. ఈ సందర్భంగా లేపాక్షి జవహర్ నవోదయ విద్యార్థినులు కృతి స్కందజ, శ్రీ సాయి, తనుశ్రీ లు పాల్గొని తమ అభినయంతో అందరినీ మెప్పించారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి ఫౌండేషన్ రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు, ఇతర జిల్లాల ప్రతినిధులు శ్రీనివాసులు, చంద్రశేఖర్, విజయ్ కుమార్, బాలాజీ, అంపయ్య, శశికళ, ఉదయ్, తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ చిర్ర సతీష్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు'

ప్రజాశక్తి-మడకశిర

కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఎన్నికల హామీలను వంద శాతం అమలు చేస్తుందని బిసి సాధికారిక రాష్ట్ర కన్వీనర్ విఎం.పాండురంగప్ప తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం రొళ్ల ఇందిరమ్మ కాలనీలో టిడిపి నాయకులు పర్యటిం చారు. ఇంటింటికీ వెళ్లి 'సుపరిపాలనలో తొలి అడుగు'కు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేసి వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో రొళ్ల మండల అధ్యక్షుడు జికె.ఈరన్న, నాయకులు రామకృష్ణ, దాసిరెడ్డి, సన్నతిమ్మప్ప, మారుతి ప్రసాద్, భరత్, నాగేంద్ర, నాగేష్, నాగరాజు, శ్రీరంగప్ప, డీలర్లు నారాయణప్ప, నరసింహమూర్తి, హనుమంతునాయక్, తిమ్మరాజు, హనుమంతు, ప్రదీవ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే మడకశిర మండలంలోని మానూరు, వైబి.హళ్లి గ్రామ పంచాయతీల్లో టిడిపి ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ నాగరాజు, ప్రధాన కార్యదర్శి మారుతిరెడ్డి, ప్రసాద్, రవీంద్రారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.




మడకశిరలో 'సుపరిపాలనలో తొలి అడుగు'కు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితులపై నివేదిక

ప్రజాశక్తి-హిందూపురం

సోమందేపల్లి కేజీబీవీ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయలో చదువుతూ అస్వస్థకు గురైన విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితులపై నివేదిక అందజేసినట్లు స్థానిక డిప్యూటీ తహశీల్దార్ మైనుద్దీన్ తెలిపారు. ప్రాథమిక చికిత్స అనంతరం పలువురు విద్యార్థినిలను చికిత్స నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీంతో పెనుకొండ ఆర్డీవో ఆదేశాల మేరకు డిప్యూటీ తహశీల్దార్ మైనుద్దీన్ ఆదివారం ప్రభుత్వాసుపత్రికి చేరుకొని చికిత్స పొందుతున్న విద్యార్థుల వివరాలను, వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా వైద్యులతో ఆయా విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకొని నివేదికను తయారుచేసి ఉన్నతాధికారులకు అందజేస్తున్నట్లు మైనుద్దీన్ తెలిపారు.



లేపాక్షి ఆలయం వద్ద మాజీ ఎంపి జివిఎల్, నాయకులు

లేపాక్షికి యూనెస్కో గుర్తింపు దక్కాలి

ప్రజాశక్తి-లేపాక్షి

స్థానిక దుర్గావీరభద్రపాపనేశ్వరస్వామి, నంది ఆలయాలను ఆదివారం మాజీ రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు సందర్శించారు. ఆయన మాట్లాడుతూ లేపాక్షి ఆలయాన్కికి యూనెస్కో శాశ్వత గుర్తింపు దక్కాలంటే ప్రతి ఒక్కరూ సహకరించాలని, కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. అంతేకా కుండా ప్రజాప్రతినిధులు ముందుండి నడిపించాలన్నారు. గతంలో తాను పార్లమెంట్ సభ్యులుగా ఉన్నప్పుడు తాత్కాలిక యూనెస్కో గుర్తింపు ఇప్పించామన్నారు. అలాగే గ్రామం మధ్యలో మంజూరైన జాతీయ రహదారిని బైపాస్ రోడ్డు మంజూరు చేయించామన్నారు. లేపాక్షి ఆలయ విశిష్టత ప్రపంచం నలుమూలలా వ్యాపించేలా యూనెస్కో గుర్తింపు తీసుకురావడానికి ఎప్పటికీ తన వంతు సహాయ, సహకారాలు ఉంటాయన్నారు. కూటమి ప్రభుత్వం కూడా అభివృద్ధి చేయడానికి ఎల్లవేళలా ముందుం టుందన్నారు. ఆయన వెంట ఆలయ కమిటీ ఛైర్మన్ రమానందన్, వేణుగోపాల్‌రావు, నరసింహమూర్తి ఉన్నారు.

'మీకోసం' కాల్ సెంటర్‌ను వినియోగించుకోండి : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

మీకోసం కాల్ సెంటర్ 1100 సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజలు ఇచ్చే అర్జీలు పరిష్కారం కాకపోతే వాటికి సంబంధించి సమాచారం తెలుసుకోవడానికి 1100కు కాల్ చేయవచ్చన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ జిల్లా అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు.

ఘనంగా జాతీయ గ్రామీణాభివృద్ధి దినోత్సవం

ప్రజాశక్తి-గుడిబండ



అమడగూరులో గ్రామీణాఅభివృద్ధి దినోత్సవంలో పాల్గొన్న అధికారులు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఎంపిడిఒ కేశవరెడ్డి ఆధ్వర్యంలో జాతీయ గ్రామీణాఅభివృద్ధి దినోత్సవాన్ని వివిధ శాఖ అధికారులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్వే డిప్యూటీ తహశీల్దార్ రామ్‌భూపాల్‌రెడ్డి, ఈవోఆర్డీ నాగరాజ్ నాయక్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, ఉపాధి హామీ, ఐసిడిఎస్, ఆశా, తదితర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమడగూరు : మండలంలోని 9 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామ సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ప్రపంచ గ్రామీణాభివృద్ధి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అధికారులు ప్రపంచ గ్రామీణాభివృద్ధి దినోత్సవం ప్రాముఖ్యతను, గ్రామీణాభివృద్ధి గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు జానకి, మమత, భాస్కర్, చంద్ర, శ్రీనివాసులు, సునియా, ప్రజలు పాల్గొన్నారు.

నల్లచెరువు : స్థానిక గ్రామ సచివాలయంలో సర్పంచి పంచరత్నమ్మ ఆధ్వర్యంలో ప్రపంచ గ్రామీణాభివృద్ధి దినోత్సవం నిర్వహించారు. ఇందులో గ్రామీణాభివృద్ధి, తదితర అంశాలను వివరిం చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రఘునాథ్ గుప్తా, ఎపిఎం రమణప్ప, పంచాయతీ సెక్రటరీ నరేషకుమార్, వైద్యాధికారి, వైద్య, ఉపాధి హామీ, సచివాలయ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలి


ఎస్‌యుసిఐ పార్టీ నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని ఎస్‌యుసిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక డిఎల్ రోడ్డులోని ఎస్ యు సి ఐ (కమ్యూనిస్టు) పార్టీ కార్యాలయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై సదస్సు జరిగింది. పార్టీ జిల్లా కమిటీ నాయకులు రంగనాయకులు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో పాల్గొన్న పార్టీ జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కమిటీ సభ్యులు గిరీష్ మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలు విపరీతంగా ప్రైవేటీకరణకు గురవుతున్నాయని, రోజురోజుకూ నిరుద్యోగం, పేదరికం, అవినీతి పెరిగిపోతు న్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే భవిష్యత్తు అంధకారంగా మారుతుందన్నారు. కులమతాలకు అతీతంగా ఐక్యమై ఉద్యమాలు చేపట్టినప్పుడు మాత్రమే ప్రజల అసలైన సమస్యలు తీరతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సిఎల్ రామకృష్ణారెడ్డి, అశోక్, మల్లిక్ దత్, సుమలత, సభ్యులు సంజీవరాయప్ప, పూజిత, మంజునాథ్, చైత్ర, మీరా ఖాన్, విద్యార్థులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

టిడిపితోనే అభివృద్ధి, సంక్షేమం

ప్రజాశక్తి-రొద్దం



కరపత్రాలు పంపణీ చేస్తున్న నాయకులు

రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం టిడిపితోనే సాధ్యమని ఆ పార్టీ మండల నాయకులు పేర్కొ న్నా రు. సిఎం చంద్రబాబు రాష్ట్రం సుపరి పాలన అందిస్తున్నారని తెలిపారు. మంత్రి సవిత ఆదేశాల మేరకు ఆదివారం టిడిపి నాయకులు 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా మండలంలోని మోపర్లపల్లి గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సుపరిపాలనకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. మాధవ నాయుడు మాట్లాడుతూ చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఉత్తమ పరిపాలన అందిస్తుందన్నారు. సంక్షేమ పథకాల అమలు, సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరహరి, నాయకులు చంద్రమౌళి, చిన్నప్పయ్య, టైలర్ ఆంజనేయులు, క్రిష్టప్ప, సిద్దన్న, మోపర్లపల్లి సర్పంచి మంజు, రంగన్న, పంచాయితీ కన్వీనర్ మారుతి, ప్రభాకర్, లింగప్ప, ఆది, అశోక్, చంద్రశేఖర్, మస్తాన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.


ఓబులేశ్వరస్వామి కొండకు భక్తుల తాకిడి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్


మండలంలోని జగరాజుపల్లి సమీపంలో కొండపై వెలసిన ఓబులేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం కొండపై వెలసిన ఓబులేశ్వరస్వామిని మండల వాసులే కాకుండా అధిక సంఖ్యలో భక్తజనం దర్శించుకుని మొక్కు తీర్చుకున్నారు. కొండ వద్ద ఆలయ కమిటీ ఛైర్మన్ వాసుదేవరెడ్డి భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కొండ కింద కళ్యాణ మండప నిర్మాణం పూర్తి దశకు చేరుకుంది. అందులో విడిది గదుల నిర్మాణానికి కొత్తపల్లి బావిరెడ్డి రూ. లక్ష విరాళాన్ని ప్రకటించారు. కళ్యాణ వేదిక నిర్మాణానికి వెంకటగారిపల్లి రాంభూపాల్ రెడ్డి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కొండపైన వారం లోపు దీప స్తంభం ఏర్పాటు చేస్తామన్నారు. కొండపైకి తారు రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆలయ నిర్వాహకులు కోరారు. ద్వాదశి రోజున ఆలయ సమీపంలో బూచేపల్లి ఈడిగ రామప్ప కుమారులు అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. పూజారి పెద్ద వెంకటరామప్ప, ఓబులేసు, శ్రీరాములు కొండపైన భక్తుల కోసం ఏర్పాట్లు చేయించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు సూర్యనారాయణ రెడ్డి, దయ్యాల ఉమా పతి, పి.రంగారెడ్డి, రామచంద్రారెడ్డి, గూడూరు శంకర్, జయరామిరెడ్డి, చెన్నయ్య, ఆనంద్, ఓబుల్‌రెడ్డి, వెంకటగారిపల్లి శంకరప్ప పాల్గొన్నారు.

ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు

బుక్కపట్నం : మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో తొలి ఏకాదశి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుక్కపట్నంలో ఎలవ గంపను పుర వీధుల గుండా ఊరేగించి చెరువులో పూజలు నిర్వహించారు. అక్కమ్మ దేవతలకు 9 మంది చిన్నారుల చేత ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కు తీర్చుకున్నారు. స్థానిక చిన్నాగమ్మ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. రైతులు అలంకరించిన ఎడ్లబండ్లను గ్రామంలో ఊరేగించారు.



పుట్టపర్తి : కొండపై వెలసిన ఓబులేశ్వరస్వామి



బుక్కపట్నంలో ఎలవ గంపను ఊరేగిస్తున్న భక్తులు

వైభవంగా రుక్మిణి పాండురంగస్వామి రథోత్సవం

హిందూపురం : హిందూపురం పట్టణ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లిలో ఆదివారం తొలి ఏకాదశిని పురస్కరించుకుని రుక్మిణి పాండురంగ స్వామి రథయాత్ర వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేష్ కుమార్ హాజరై రథోత్సవాన్ని ప్రారంభించారు. ఉదయం నుండి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం రథయాత్ర ఆంజనేయస్వామి గుడి దగ్గర నుండి ముదిరెడ్డిపల్లి ప్రధాన రహదారుల్లో మీదుగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మద్దన జయరాములు, టిడిపి నాయకులు పల్లా లక్ష్మి కుమార్, పురిడి మంజునాథ్, డీసీ. రఘు, డి. హరీష్ కుమార్, పామిశెట్టి శేఖర్, దుర్గా నవీన్, రామాంజనేయులు, ఆలయ కమిటీ మెంబర్లు, అధికసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

అంధత్వ నిర్మూలనే లయన్స్ క్లబ్ లక్ష్యం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్



లయన్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం

పేద ప్రజల అంధత్వ నిర్మూలనే లయన్స్ క్లబ్ లక్ష్యమని క్లబ్ ఇన్‌స్టలేషన్ ఆఫీసర్, ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గోపా నరసింహులు తెలిపారు. పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో ఉన్న లయన్స్ క్లబ్ ఆసుపత్రిలో ఆదివారం 2025-26 క్లబ్ కమిటీ కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నరసింహులు మాట్లాడుతూ దేశ స్థాయిలో లయన్స్ క్లబ్ విశేష సేవలు అందిస్తూ లక్షల మందికి అంధత్వాన్ని తొలగించి కంటి వెలుగును ప్రసాదించిందన్నారు. నూతన కమిటీ సభ్యులు లయన్స్ క్లబ్‌ను మరింత అభివృద్ధి బాటలో నడుపుతూ పేదలు, సమాజానికి సేవలు అందించాలన్నారు. కమిటీ నూతన అధ్యక్షులుగా ఆకులేటి రమేష్‌బాబు, కార్యదర్శిగా ఉలవల నాగేంద్ర, కోశాధికారిగా కొత్తపాలెం వెంకటేష్ కుమార్‌ని ప్రకటించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. పాత కమిటీ సభ్యులు నూతన కమిటీకి పూర్తి సహాయ, సహకారాలు, సలహాలు ఇవ్వాలని కోరారు. నూతన కమిటీ సభ్యుల చేత ప్రతిజ్ఞ చేయించారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా ఉచిత కంటి పరీక్షలతో పాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు లయన్స్ క్లబ్ అభివృద్ధికి పాటు పడతామని తెలిపారు. అనంతరం నూతన కమిటీని బంధుమిత్రులు, లయన్స్ క్లబ్ వారు ఘనంగా సత్కరించారు. సభ అధ్యక్షులుగా వేణుగోపాలా చార్యులు, సభ నిర్వహణ అధ్యక్షులుగా లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు వెంకటస్వామి వ్యవహరించారు. కార్యక్రమంలో పల్లెం వేణుగోపాల్, రాజీవ్‌నేత, గూడూరు మోహన్‌దాస్, గోసే రాధాకృష్ణ, ఉట్టి శివప్రసాద్, సాగా సురేష్, చందా నాగరాజు పాల్గొన్నారు.

గేదె దూడపై చిరుత దాడి

ప్రజాశక్తి-రొళ్ల



చిరుత దాడిలో గాయపడిన దూడను పరిశీలిస్తున్న అటవీ శాఖ, పోలీసు అధికారులు

మండలంలోని హెచ్‌టి.హళ్లి గ్రామానికి చెందిన మహాదేవనచెరువు సమీపంలో ఆదివారం మధ్యాహ్నం గేదె దూడపై ఓ చిరుత దాడి చేసింది. గేదె దూడ యజమాని గోవిం దప్ప తెలిపిన వివరాలు.. గేదెతో పాటు దూడను మేత కోసం మహాదేవనచెరువు సమీపంలో వదలి తాను పొలం పనులు చేస్తుండగా గేదె అరుపులు వినపడ్డాయన్నారు. దీంతో అక్కడికి వెళ్లి చూడగా గేదె దూడపై చిరుత దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిందన్నారు. విషయం తెలిసిన వెంటనే ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మహాదేవప్ప, వాచర్ భీమప్ప, షౌకత్ వలి సంఘటనా స్థలాన్ని సందర్శించారు. చెరువు చుట్టుపక్కల చిరుత సంచారాన్ని పరిశీలించారు. రైతులు, గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని, చిరుత సంచరించినట్లు తెలిస్తే తమకు వెంటనే సమాచారం అందించాలని తెలిపారు. పశు వైద్య సిబ్బంది గేదె దూడకు చికిత్స అందించినా ఫలితం లేకపోయింది.